క్లుప్తంగా

గుంతలు పూడ్చివేత



ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట టౌన్ : రాజంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతలు ప్రమాదకరంగా ఉండేవి. ఈ నేపథ్యంలో ఈనెల 18వ తేదీ 'అదమరిస్తే.. ఆసుపత్రికే' అన్న శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో వెలువడిన వార్తకు ఆర్అండ్బీ అధికారులు స్పందించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతలన్నింటిని సోమవారం తారు పోసి పూడ్చివేశారు. గుంతల కారణంగా గతంలో చిన్న, చిన్న ప్రమాదాలు జరిగాయి. 'సాక్షి'లో వెలువడిన వార్తకు అధికారులు స్పందించి గుంతలను పూడ్చించడం పట్ల వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వాహనదారులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుపనున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10.00 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో, ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు.

వీఆర్ఏల సంఘానికి నూతన కమిటీ

గాలివీడు : మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర నేతృత్వంలో సోమవారం స్థానిక కార్యాలయం వద్ద సంఘం సమావేశం నిర్వహించారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడిగా భోగేశ్వరయ్య ప్రధాన కార్యదర్శిగా బచ్చోటి చంద్రశేఖర్లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గాలివీటి నారాయణ, కోశాధికారిగా తరుగు సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శి మిట్టపల్లి ఇరగంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రెడ్డెయ్య విజయ్, నాగరాజ, పీరుబాషా, చక్రవర్తి తదితరులను ఎన్నుకున్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న పుల్లంపేట ప్రజలు

పుల్లంపేట : పుల్లంపేట శ్మశాన ప్రహరీ గోడను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పుల్లంపేట గ్రామ ప్రజలు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు వినతిపత్రం సమర్పించారు. ఆక్రమణదారులు శ్మశానాన్ని కూల్చి పదిరోజులు అయినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే ప్రహరీ గోడ కూల్చినవారిపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు.


సేవా దృక్పథం ఉండాలి



అనాథ పిల్లలకు పండ్లు అందజేస్తున్న ఎన్సీసీ విద్యార్థులు

రాజంపేట : బోయనపల్లిలోని అన్నమాచార్య యూనివర్సిటీ ఎన్సీసీ విద్యార్థులు సోమవారం ఇసుకపల్లి రోడ్డు, సిద్దేశ్వర కాలనీలో ఉన్న లవింగ్ ఆర్మ్స్ ఆర్ఫనేజ్ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు పండ్లు, టూత్ పేస్ట్, టూత్ బ్రెస్లను అందజేయడం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్సీసీ డేను పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, సీటీఓ ఎన్ దీప్తి, ఎన్సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

లక్కిరెడ్డిపల్లి : చిన్నా, పెద్ద, కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే అయ్యప్ప దీక్ష పరమార్థమని గురుస్వాములు వెంకటేష్, బసిరెడ్డి, గంగరాజు, గంగయ్యలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని దప్పేపల్లె గ్రామం, వీరారెడ్డిగారిపల్లికి చెందిన పుల్లగుర అరవింద్ స్వామి ఆధ్వర్యంలో అంబలం పూజను నిర్వహించారు. మేదరపల్లి చెక్కభజన రవి బృందం అయ్యప్ప భజన పాటలతో అలరింపచేశారు. అనంతరం మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

కనుమరుగవుతున్న రైల్వేకోడూరు ప్రాశస్త్యం!

- పేరులో రైల్వే ఉన్నా ఆగని ఎక్స్ప్రెస్ రైళ్లు
- విన్నవించినా ఆపకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి
- శబరిమలై స్పెషల్ రైళ్ల స్టాపింగ్పై సందిగ్ధం



ముగ్గురాయి రవాణా లేకపోవడంతో ఖాళీగా ఉన్న యార్డు



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న రైల్వేకోడూరు రైల్వేస్టేషన్

ఓబులవారిపల్లె : బ్రిటీష్ కాలంలో కోడూరులో రైల్వే స్టేషన్ను ఏర్పాటు చేశారు. అప్పట్లో బ్రిటీష్ వారు రైల్వే పట్టాలు కలప (స్లీపర్) ద్వార పట్టాలు సిద్ధం చేశారు. ఇందుకు కావాల్సిన కలప కోడూరు పరిసరాల్లోని శేషాచల అడవుల్లో ఎక్కువగా లభించేది. దీంతో ఇక్కడి నుంచి కలపను ఇతర ప్రాంతాలకు తరలించేవారు. అప్పట్లో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండేది. కోడూరు రైల్వేస్టేషన్కు ప్రాధాన్యత పెరగడంతో రానురాను రైల్వేకోడూరుగా మారింది. ప్రస్తుతం రైల్వే పరంగా కోడూరు గడ్డు రోజులే ఎదురవుతున్నాయనే చెప్పాలి. కోడూరు స్టేషన్లో గతంలో స్టాపింగ్లు ఉన్న రైళ్లు కూడా ప్రస్తుతం కోడూరులో నిలవకపోవడంతో కోడూరులో కలుపుకున్న రైల్వే పదానికి ప్రస్తుతం అన్యాయం జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే విస్తరణకు సహకరించిన కోడూరుకు ఇలాంటి స్థితి రావడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

ఉమ్మడి జిల్లాలలో ఉద్యాన పంటలకు రైల్వేకోడూరు నియోజవర్గం పేరుగాంచింది. బ్రిటీష్ కాలం నాటి నుండి ఇక్కడ పండించిన తమలపాకు, అరటి, బొప్పాయి తదితర పంటలు రైళ్ల ద్వార పెద్ద ఎత్తున ఇతర ప్రాంతలకు ఎగుమతి అయ్యేవి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ ముగ్గు పిండి సరుకు రవాణా రైళ్ల ద్వార చెన్నై పోర్టుకు అక్కడి నుండి విదేశాలకు చేరేవి. దీంతో నాడు రైతులు వ్యాపారస్తులు, కూలీలు ఉద్యోగులు పీఎఫ్ స్టాల్లు వ్యాపారస్తులతో ఎప్పుడు కళకళలాడుతుండేది. ప్రస్తుతం భారీ స్థాయి వాహనలు మంగంపేట ముగ్గురాయిని నేరుగ పోర్టులకు తరలిస్తున్నారు. పర్యవసనంగా రైల్వేల ద్వార ముగ్గురాయి ఎగుమతులు గననీయంగా తగ్గిపోయాయి. తమలపాకు బొప్పాయి తదితర పంటలు వ్యాపారులు లారీల ద్వారానే ఎగుమతులు చేస్తున్నారు. దీంతో రైల్వేకొడూరు రైల్వేస్టేషన్ ప్రస్తుతం వెలవెలబోతుంది.

ఎక్స్ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేత

రైల్వేకోడూరులో గతంలో అన్ని ఎక్స్ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఉండేది. మంగంపేట వ్యాపారస్తులు, పంటలు ఎగుమతి చేసే వ్యాపారులు, స్థానిక ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు చేస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రతి నిత్యం ప్రయాణిస్తుంటారు. ఎక్స్ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేయడంతో అటు రేణిగుంటకు దాదాపు యాభై కిలోమీటర్లు ప్రయాణించి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా ఎక్స్ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కల్పించాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు రైల్వేశాఖ మంత్రి, అధికారులను కోరారు. ఇప్పటి వరకు అధికారులు స్పందించ లేదు దీంతో ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. శబరిమలై వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్పెషల్ రైళ్లకు కోడూరులో స్టాపింగ్ కల్పించాలని కోరుతున్న రైల్వే అధికారుల నుంచి స్పష్టత లభించడం లేదు.

నిర్లక్ష్యం వీడాలి



రైల్వేకొడూరులో పలు ఎక్స్ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించడమే కాక సమస్యలు పరిష్కరించాలని గతంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్రెడ్డితో కలిసి కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఆయన సానుకూలంగా స్పందించాడు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పరిష్కారం కావడంలేదు. అధికారులు వెంటనే స్పందించి కోడూరుకు గతంలో నిలిచే రైళ్లను నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలి.

– తల్లెం భరత్కుమార్రెడ్డి, డీఆర్యూసీసీ మాజీ మెంబర్, ఓబులవారిపల్లె

ఎక్స్ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి



వ్యాపారపరంగా, విద్యార్థులకు ఉద్యోగులు ఎక్స్ప్రెస్ రైళ్ల స్టాపింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రేణిగుంటకు వెళ్లి రైళ్ల ఎకవాల్సిన పరిస్థితి దాపురించింది. రైల్వేకోడూరులో అన్ని ఎక్స్ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించి పూర్వపు వైభవం వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– దమ్ము రఘు, ఉల్లగడ్డపోడు, రైల్వేకొడూరు

ప్రపంచ దేశాలకు ఆదర్శం మన రాజ్యాంగం



రాయచోటి టౌన్ : ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్రెడ్డి అన్నారు. సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించడబడిన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదింపబడగా, 1950 జనవరి 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించాడన్నారు. భారత రాజ్యాంగం ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా నేడు (మంగళవారం) రాయచోటి వైఎస్సార్సీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటనలో తెలియజేశారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మదనపల్లె: మదనపల్లె మండలం గుడిసెవారిపల్లికి చెందిన అజయ్ కుమార్ కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు మహానేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి సోదరి విమలారెడ్డి ఆదివారం రాత్రి హాజరయ్యారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్థులు, వైఎస్సార్ పార్టీ నాయకులతో ముచ్చటించారు. అంతకుముందు మదనపల్లెకు వచ్చిన విమలారెడ్డిని మదనపల్లె వైయస్సార్సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ సాదరంగా ఆహ్వానించి బస ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు.

భగవంతుని సేవలోనే నిజమైన సంతృప్తి



ఒంటిమిట్ట: విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట టౌన్ : భగవంతుని సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఆకేపాడు క్రాస్ రోడ్డు ప్రాంతంలో సోమవారం సుబ్బరాయుడు శెట్టి, కాంతమ్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే ఆకేపాటి, ఆకేపాటి జ్యోతమ్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో..

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గంగపేరూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన జమ్మి చెట్టు శివాలయంలో సోమవారం శివలింగ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, 8 గంటలకు చెక్కభజనతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, సౌమిత్రి, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : తమ గృహాలను కూల్చివేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం బావులకాడపల్లె గ్రామపంచాయతీ ఎస్ఆర్ ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు డీఆర్ఓకు విన్నవించారు. సోమవారం ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్ ఆధ్వర్యంలో ఎస్టీకాలనీకి చెందిన గిరిజనులు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో డీఆర్ఓను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథనాయక్ మాట్లాడుతూ 2012లో సర్వేనంబరు 1432/3 సర్వే నంబరులో ఎస్టీ కాలనీకి చెందిన 50 కుటుంబాలకు ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున డీ ఫారం పట్టాలు మంజూరు చేశారన్నారు. ఇందులో గిరిజనులు పక్కాగృహాలు నిర్మించుకున్నట్లు తెలిపారు. కాగా అదే సర్వే నంబరులో ఏపీఐఐసీ వారు తమకు రెండెకరాలు భూమిని కేటాయించారని, మీరు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని, లేనిపక్షంలో ఇళ్లను జేసీబీలతో కూల్చేస్తామంటూ కొందరు గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ ఆరోపించారు. కాగా సదరు వ్యక్తులు దశాబ్దాలుగా గిరిజనుల అనుభవంలో ఉన్న శ్మశానవాటిక రహదారులను సైతం వదలకుండా కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే విచారణ జరిపించి కబ్జాకు ప్రయత్నిస్తూ గిరిజనులను బెదిరిస్తున్న వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆయన గిరిజనులతో కలసి డీఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు.

ప్రమాదాల నివారణకే రోడ్ల మరమ్మతులు



గుంతలను పూడ్చే ప్రక్రియను పరిశీలిస్తున్న సీఐ

రాజంపేట : కడప – రేణిగుంట జాతీయ రహదారిలో అన్నమయ్య విగ్రహం ప్రాంతంలో గుంతల సమస్య పరిష్కరించే విషయమై మన్నూరు సీఐ ఎస్ఎం అలీ జోక్యం చేసుకున్నారు. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు కదిలారు. సోమవారం గుంతలు పూడ్చే పనిలో సంబంధిత కాంట్రాక్టు కార్మికులు నిమగ్నమయ్యారు. ఈ పనులను సోమవారం సీఐ అలీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చిన్న గుంతలు పెద్దవిగా తయారు కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని నేషనల్ హైవే అథారిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. గుంతలు పూడ్చడం వలన ప్రమాదాలను కొంతమేర నివారించవచ్చన్నారు.

శైవ క్షేత్రం.. కార్తిక శోభితం

కార్తిక చివరి సోమవారం మూడు నియోజకవర్గల పరిధిలోని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు వేకువజాము నుంచే ఆలయాలకు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. మహిళలు పెద్దఎత్తున ఆలయాలకు తరలి వచ్చి దీపాలను వెలిగించారు. ప్రత్యేక అలంకరణల్లో కొలువైన శివపార్వతులను భక్తులు దర్శించుకొని తరించారు. పలు శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి, నెట్వర్క్



సిద్దవటం: నిత్యపూజస్వామి కోనలో..



పుల్లంపేట: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిన్నమండెం: శివాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు



ఒంటిమిట్ట: కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



రామాపురం: హరిహరాలయ ఆలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న మహిళలు



రాయచోటి టౌన్: వీరభద్రస్వామి ఆలయంలో..

పనిభారం తగ్గించండి

సిద్దవటం : వీఆర్ఓలపై పడుతున్న పనిభారాన్ని తగ్గించాలని మండలంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఓలు మండల ఇన్చార్జి తహసీల్దారు మాధవీలతకు వినతి పత్రాన్ని వీఆర్ఓలు సమర్పించారు. సోమవారం వారు మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి లిస్టు తయారు, రీ సర్వే, రెవెన్యూ గ్రామ సభలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, జనరల్ ఓటర్ల లిస్టు డోర్ టు డోర్ సర్వే, శని, ఆదివారాల్లోనూ స్పెషల్ క్యాంపులు, వివిధ రకాలైన రెవెన్యూ విధులు నిర్వహిస్తు పనిభారంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. రెవెన్యూకు సంబంధించిన పనులు మాత్రమే తమకు అప్పగించాలని వారు కోరారు.

నాటు సారా ఊట ధ్వంసం



సారా ఊటను పగలగొడుతున్న ఎస్ఐ

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ పెద్దబిడికి సమీపంలో 100 లీటర్ల నాటు సారా ఊటను ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం ధ్వంసం చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కరపత్రాలు ఆవిష్కరణ

రాజంపేట రూరల్ : హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షులు తుమ్మలపెంట పాలప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు ధర్మకర్తలతో కలిసి సోమవారం కరపత్రాలను విష్కరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం గ్రామోత్సవం ప్రారంభమవుతుందన్నారు. పాత బస్టాండులోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద నుంచి మహిళలు జ్యోతులు పట్టుకుని అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో పాల్గొనాలన్నారు. రాత్రి 10గంటలకు అంబటి రామస్వామి మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా చెక్క భజనలు, భక్తిగీతాల ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు.

వేలాడుతూ.. వెళ్లాల్సిందే!



బస్సు నిండడంతో ఫుట్బోర్డుపై ఉన్న ప్రయాణికులు

రామాపురం : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రామాపురం ఉంది. మండలంలో పని చేసే ఉద్యోగులు ఇటు రాయచోటి నుంచో అటు కడప నుంచో వస్తూ వెళ్తుంటారు. కాగా కడప – రాయచోటి మార్గంలో సాయంత్రం వేళల్లో పల్లె వెలుగు బస్సు సర్వీసులు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి రాయచోటికి, కడపకు వెళ్లే వారు మండల కేంద్రంలో ఫుట్ పాత్కు వేలాడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. పలు సందర్భాల్లో తోపులాట, ఘర్షణలు సైతం జరుగుతున్నాయని ప్రయాణికులు తెలిపారు. రాయచోటి ఆర్టీసీ డీఎంఓ మావైపు చూడండి అంటూ విద్యార్థులు, ఉద్యోగులు కోరుతున్నారు. సాయంత్రం వేళల్లో ప్రత్యేక సర్వీసును నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వెలిగల్లు నీటిని సరఫరా చేయండి



ధర్నా చేస్తున్న రాజులకాలనీకి చెందిన మహిళలు

రాయచోటి అర్బన్ : పట్టణ శివార్లలోని చెన్నముక్కపల్లె గ్రామం రాజుల కాలనీకి చెందిన ప్రజలకు వెలిగల్లు వాటర్ స్కీం తాగునీటిని పైపులైన్ ద్వారా సరఫరా చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సమిత్ర డిమాండ్ చేశారు. రాజుల కాలనీకి చెందిన మహిళలు సోమవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను రాజుల కాలనీ ప్రజలు పలుమార్లు మండలస్థాయి అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. దాదాపు 200 కుటుంబాల ప్రజలు కనీస అవసరాలకు సైతం నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి రాజుల కాలనీకి వాసులకు వెలిగల్లు వాటర్స్కీం నీటిని పైపులైన్ ద్వారా సరఫరా చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ కోరారు. అనంతరం ఈ మేరకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ జిల్లాకమిటీ సభ్యుడు ఎస్.శ్రీనివాసులు, నేతలు ఓబులేసు, సుదర్శన్, మహిళా సమాఖ్య నాయకురాళ్లు రాజుల కాలనీ మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

వీరబల్లి : మండలంలో మట్లి పంచాయతీలోని తొగటిపల్లి వడ్డిపల్లిలో దాదాపు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను సోమవారం ప్రారంభించారు. ఈ పనులు పంచాయతీ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది.

రాజ్యాంగ విధులను బాధ్యతగా అనుసరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుండుపల్లె : మండల పరిధిలోని జీకే రాచపల్లి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం ఉపాధ్యాయులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో త్రివర్ణ పతాకంతో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ భారత ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా రాజ్యాంగంగా నిలిచిందని, రాజ్యాంగం కల్పించిన హక్కులతోపాటు విధులను అనుసరిస్తూ జీవించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు.


వీరభద్రస్వామికి పల్లకి సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారికి పల్లకి సేవ జరిపారు. సోమవారం రాత్రి మూల విరాట్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకిలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు.

మాలధారులకు భిక్ష ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని నామాలగుట్టపై ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సోమవారం అయ్యప్ప భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, సతీమణి మాధవి, జైవర్ధన్ రాజు, విశ్వభారతి హైస్కూల్ కరస్పాండెంట్ గంగాధర్ రాజు, సతీమణి కల్పనల పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు చెల్లు గంగరాజు, గురుస్వాములు వెంకటేష్, సుధీర్ కుమార్, బుజ్జీలు తెలిపారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

రాజంపేట : వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్చార్జ్ ఏఓ నారాయణస్వామికి తమ డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ హామీ మేరకు గౌరవ వేతనం రూ.5 వేలు నుండి రూ.10 వేలకు పెంచాలన్నారు.